# చిల్లర దేవుళ్ళు

ఆర్.వి.పురుషోత్తం



నా స్వగ్రామం తిరుపతి. ఉద్యోగం కోసం మదనపల్లి నివాసినయ్యాను. అలాగని తిరుపతికి రానను కునేరేమో. ప్రతీ శనివారం సాయంత్రం తిరుపతికి వచ్చి సోమవారం ఉదయాన్నే బెంగుళూరు బస్‌లో మదనపల్లికి వెళ్తుంటాను. మరి నా శ్రీమతి తిరుపతిలోనే వుంటుంది. ఎందుకంటారా? మా వాళ్ళంతా తిరుపతిలోనే వుంటారు. నా ఒక్కడి కోసం మరలా మదనపల్లెలో కాపురం పెట్టడం ఎందుకు? ఎలాగోలా త్వరలో తిరుపతికి ట్రాన్స్‌ఫర్ చేయించుకుంటాను.

ఆ రోజు శనివారం. నెలాఖరు రోజులు. ఉన్న వంద రూపాయిల నోటు జేబులో వేసుకుని కాలేజి వర్కింగ్ అవర్స్ అయిపోగానే నేరుగా బస్టాండ్‌కు వెళ్ళి తిరుపతి బస్ ఎక్కేశాను. ఎందుకనో ఆ రోజు త్వరగా వెళ్ళి నా శ్రీమతితో సినిమాకెళ్ళాలన్న కోరిక కలిగింది.

కండక్టరుకు నూరు రూపాయల నోటు ఇస్తే టికెట్ ఇచ్చి నాకు తిరిగి ఇవ్వవలసిన చిల్లర టికెట్ వెనకాల నోట్‌చేసి మరలా తీసికోమని చెప్పినాడు.

తిరుపతి రాగానే బాలాజీ కాలనీ స్టాపింగ్‌లో దిగి నేరుగా ఇంటికి వచ్చేశాను. త్వరగా నేను, నా శ్రీమతి భోజనాదులు ముగించుకొని నాకిష్టమైన శరత్‌బాబు నటించిన 'కాంచనగంగ' సినిమాకు వెళ్ళాము.

బుకింగ్ దగ్గర టికెట్ తీద్దామని జేబులో వెయ్యి పెడితే బస్ టికెట్లు నన్ను చూసి పరిహసించాయి. అప్పుడు గుర్తుకొచ్చింది నేను బస్‌లో కండక్టర్ నడిగి చిల్లర తీసికోకుండానే బస్ దిగి వచ్చేశాను అని.

ఎక్కడికెళ్ళినా వ్యానిటీ బ్యాగ్‌లో చిల్లర వేసుకుని వచ్చే మా ఆవిడ అలవాటు నేను శ్రీమతితో 'కాంచనగంగ' సినిమా చూడాలనుకున్న నా కోర్కెను ఆ విధంగా తీర్చింది. (కాని తెరమీద మాత్రం నాకు వంద రూపాయిల నోటు మాత్రమే కనిపించింది.)

''అబ్బ త్వరగా లేవండి, మార్కెట్‌కు వెళ్ళిరావాలి'' అని మా ఆవిడ పాడిన సుప్రభాతంతో నిద్ర లేచాను. ఉదయాన్నే ముగించుకొనవలసిన మామూలు కార్యక్రమాలన్నీ ముగించుకుని మార్కెట్‌కు బయల్దేరాను.

మా ఆవిడ తెమ్మంది కదా అని కాలీఫ్లవర్ బేరమాడుతు ఉండగా ''మాష్టారూ'' అన్న సంబోధన సమీపంలో వినబడింది. 'ఆ నన్ను అలా ఎవ్వరూ సంబోధించర్లే' అని ''ఆ ఏమిటోయ్! నువ్వు చెప్పిందే ధరా, కొంచెం తగ్గించుకో'' నాకు బేరమాడడం సరిగా రాదన్న మా ఆవిడ మాటలు గుర్తొచ్చి బేరమాడ సాగాను.

''మాష్టారూ మిమ్మల్నే'' ఈ సారి భుజంపై స్పర్శ.

''ఎవరు...'' ఎప్పుడూ ఆ మొహాన్ని చూసినట్లు గుర్తు లేదు.

''నేను మాష్టారూ. నిన్న మీరు వచ్చిన బస్‌లో డ్యూటీ చేసిన కండక్టర్ని.''

''ఆ!'' నాలో చిన్న ఆశ-'చిల్లర'

''నిన్న మీరు బస్ దిగి వెళ్ళేటప్పుడు చిల్లర తీసుకోవడం మర్చిపోయారండీ. ఎందుకంటే డ్యూటీ అయిపోయేముందు క్యాష్ లెక్క చూసుకునేసరికి ఇచ్చితంగా ఎనభై ఆరున్నర రూపాయిలు ఎక్కువగా వుంది. నేను మిమ్మల్ని ఆ రూట్‌లో అప్పుడప్పుడూ చూస్తుంటాను. మీరు నన్ను గమనించి వుండరు. మీరు కనబడకపోతారా అని మీకు రావలసిన చిల్లర నా జేబులో వుంచుకుని వున్నాను. ఎలాగైతేనేం మీరు కనబడ్డారు. మీ చిల్లర తీసికోండి'' అని తన జేబులోంచి ఎనభై ఆరున్నర రూపాయిలు తీసి నా చేతిలో పెట్టాడు.

ఆ కండక్టరుగారి నిజాయితీకి నాకు చాలా ఆనందం వేసింది. (అఫ్‌కోర్స్, నా చిల్లర నాకు దక్కిందన్న ఆనందం. అది అప్రస్తుతం.)

''చాలా థాంక్సండీ. మీరు చాలా ఉదార స్వభావుల్లా వున్నారు. మీలాంటివాళ్ళు బస్సుకొకరుంటే దేశం చాలా బాగుపడుతుంది'' నా ఉవాచ.

''మీరు అనవసరంగా నన్ను పొగిడేస్తున్నారు. నా ధర్మాన్ని నేను నిర్వర్తించాను. అంతే.''

''నిజంగా మీరు చాలా మంచివారండి. ఎందుకంటారా? చాలామంది బస్‌లో కండక్టర్లు టికెట్ ఇచ్చి ఇవ్వవలసిన చిల్లర మాత్రం 'మరలా తీసికోండి' అని, చిల్లర ఇవ్వకుండానే ఆ డబ్బులు తమ జేబుల్లో వేసుకుంటారు అని అంటుంటారు. అలాంటిది మీరు అంత పెద్ద మొత్తం చిల్లరను మీరే తెచ్చి ఇచ్చారు. అది గొప్పతనం కాక మరేమిటండీ!''

''చూడండి మాష్టారూ, నిజానికి చెప్పాలంటే మా కండక్టర్ల తప్పేమీ లేదండీ. ఎందుకంటే బస్‌లో ఎక్కి డ్యూటీ మొదలైనప్పటి నుంచి ప్యాసింజర్లకు టికెట్ పంచ్ చేసి ఇవ్వడం, ఏయే స్టాపింగ్‌లో పంచ్‌చేసిన టికెట్‌లు ఆ స్టాపింగ్ షీట్‌లో నోట్ చేసికోవడం వీటితోనే సరిపోతుంది. అందుకే మేము చిల్లర లేకపోతే ఇవ్వవలసిన చిల్లర టికెట్ వెనకాల నోట్‌చేసి బస్ దిగేముందు తీసుకోమని చెబుతాం. ఒక్కోసారి తొందర్లో చిల్లర తీసికోవడం మరచి దిగిపోతుంటారు. వాళ్ళ మతిమరుపును మాపై రుద్ది 'మేం అన్యాయంగా డబ్బులు సంపాదిస్తున్నాం' అని మమ్మల్ని దుయ్యబడుతుంటారు. అలా మరిచిపోకుండా చిల్లర అడిగి తీసుకుని బస్ దిగి వెడితే మాకీ అపవాదు రానేరాదు. అదండీ, సంగతి.''

ఆ విధంగా ఆ కండక్టరు చెప్పిన సమాచారం విన్న తరువాత నాలో కండక్టర్లపై వున్న ''దురాలోచన'' పటాపంచలయ్యింది. ఆ ''చిల్లర దేవుడి'' నిజాయితీకి నా మనసారా జోహారు లర్పించకుండా వుండలేక పోయాను.

కాబట్టి-చిల్లర దేవుళ్ళూ! మీకు జోహార్‌లు!!